ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
7
శుక్రవారం 15 ఆగస్టు 2025


ఆకివీడు సాలిపేటలో నేలకొరిగిన భారీ వృక్షం

జిల్లాలో 90 మి.మీ వర్షపాతం

భీమవరం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణితో భారీ వర్షం కురిసినా గురువారం వాతావరణం పొడిగా ఉంది. బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు కుండపోతంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జిల్లాలో సగటున 90 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తణుకులో అత్యధికంగా 236.6 మి.మీ., మొగల్తూరులో అత్యల్పం 8.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. తాడేపల్లిగూడెంలో 16.2. మి.మీ, పెంటపాడు 189, అత్తిలి 85.4, గణపవరం 144.4 ఆకివీడు 77.2, ఉండి 54.4, పాలకోడేరు 76.2 పెనుమంట్ర 75.2, ఇరగవరం 196.6 పెనుగొండ 193.8, ఆచంట 40.2, పోడూరు 82.6, వీరవాసరం 22.2, భీమవరం 27.6, కాళ్ల 42.6 నరసాపురం 32.4, పాలకొల్లు 35.2, యలమంచిలిలో 17.4మి.మీ వర్షపాతం నమోదైంది.

నీట మునిగిన చేలను పరిశీలించిన కలెక్టర్

అత్తిలి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతిపురం, వరిఘేడు గ్రామాల్లో భారీ వర్షాలకు నీట మునిగిన చేలను కలెక్టర్ నాగరాణి గురువారం పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షం తగ్గడంతో నీరు తొలగిపోతే పంటకు ఎలాంటి నష్టం ఉండదని కలెక్టర్ అన్నారు. మండలంలో సుమారు 400 నుంచి 500 ఎకరాలు ముంపునకు గురైనట్లు అధికారులు అంచనా వేశారు.


కె.పెంటపాడు శివారులో నీట మునిగిన వరి చేను


పెనుగొండ మండలం మునమర్రులో పంట కాలువ పొంగి చేలోకి వెళుతున్న నీరు

చేను.. చెరువు!

● 15 మండలాల్లో వరి చేలు మునక ● ఒక్కరోజు వర్షంతో రైతు కుదేలు ● వాతావరణం పొడిగా ఉంటేనే ఊరట ● బిక్కుబిక్కుమంటున్న అన్నదాత

రోజుల తరబడి వర్షం కోసం అంతా ఎదురుచూశారు. ఒకవైపు వేడి.. మరోవైపు ఉక్కపోతతో జిల్లా ప్రజలు అల్లాడిపోయారు. చినుకు కోసం తహతహలాడారు. కానీ ఒకేరోజు గంటల పాటు కురిసిన వర్షం రైతులను అతలాకుతలం చేసింది.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో బుధవారం కురిసిన భారీ వర్షానికి 15 మండలాల్లో వరి చేలు దెబ్బతిన్నాయి. దాదాపు 21వేల ఎకరాల్లో చేలు నీట మునిగాయి. పెంటపాడు మండలం పరిమళ్ల, యానాలపల్లి, తణుకు రూరల్ మండలం, ఇరగవరం, ఆచంట, యలమంచిలి తదితర మండలాల్లో వరి చేలు చెరువులను తలపిస్తున్నాయి. వాతావరణం పొడిగా ఉందని రైతులు ఎరువులు కూడా వేశారు. తొలి విడత ఎరువులు వేసిన రైతులు వర్షం కోసం ఎదురు చూశారు. ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాల్లో ఇంకా నారుమడులు ఉన్నాయి. శివారు ప్రాంతాలకు సాగునీరు అందడంలేదని రైతులు వర్షం కోసం ఎదురుచూశారు. రెండు గంటలపాటు కురిసిన కుంభవృష్టితో అన్నదాత ఆశలు తల్లకిందులయ్యాయి. వేల ఎకరాల్లో చేలు నీట మునిగాయి. గురువారం వాతావరణం పొడిగా ఉండడంతో రైతులు కాస్త కుదుటపడ్డారు. రానున్న మూడు రోజులు జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. గురువారం విద్యా సంస్థలకు సెలవు కూడా ప్రకటించారు. కానీ వాతావరణం పొడిబారింది. ఎండ కాయడంతో చేలలో నిలిచిన నీరు బయటకు వెళుతోంది. వాతావరణం పొడిగా ఉంటే రైతులకు నష్టం ఉండదని వ్యవసాయ శాఖ అంచనా.. రైతులు కూడా అదే ఆశిస్తున్నారు. లేదంటే పంట దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు.



బార్ గడువు మూడేళ్లు

- ఒకరు ఎన్ని దరఖాస్తులైనా ఇవ్వొచ్చు
- డ్రా ద్వారా లైసెన్స్ కేటాయింపు
- కనీసం నాలుగు దరఖాస్తులు ఉంటేనే డ్రా
- విధి విధానాలు ఖరారు
- త్వరలో నోటిఫికేషన్ విడుదల

భీమవరం క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బార్ లైసెన్స్‌ల కేటాయించడానికి ప్రభుత్వం విధి విధానాలు ఖరారు చేసింది. 2025-2028 వరకు మూడేళ్లకు బార్ లైసెన్స్ జారీకి విధి విధానాలు ఖరారు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కేవీ.నాగ ప్రభుకుమార్ గురువారం తెలిపారు. బార్లను లాటరీ ద్వారా కేటాయించనున్నట్లు ఆయన వివరించారు.

- జిల్లాలో 2022-2025 సంవత్సరం మాదిరి 24 బార్లకు ఓపెన్ కేటగిరీతోపాటు అదనంగా 10 శాతం బార్లు గీత కులాలకు కేటాయిస్తారు. 2025-2028 మూడేళ్లకు లైసెన్స్ జారీ చేస్తారు.
- బార్లు లాటరీ ద్వారా కేటాయిస్తారు. గీత కులాలకు కేటాయించబడిన బార్లను వేరొక నోటిఫికేషన్ ద్వారా లాటరీ తీస్తారు.
- ఒక వ్యక్తి బార్లకు ఎన్ని అప్లికేషన్లు అయినా వేసుకోవచ్చు. లాటరీలో ఒకటి కంటే ఎక్కువ బార్లు వచ్చినా సరే కేటాయిస్తారు.
- ఒక బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తియ్యడం జరుగుతుంది.
- ఆసక్తి ఉన్న వారు నేరుగా, లేదా వారి తరఫున గాని రూ. 5 లక్షలు ఫీజు చెల్లించి ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్/ హైబ్రీడ్ మోడ్‌లలో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలు త్వరలో నోటిఫికేషన్‌లో పొందుపరుస్తారు. దరఖాస్తు ప్రోసెసింగ్ ఫీజు రూ.10 వేలు అదనం.
- లైసెన్స్ పీరియడ్ మూడేళ్లు. 1-09-2025 నుంచి 31-08-2028 వరకు అమలులో ఉంటుంది.
- ఏడాదికి రిటైల్ ఎక్సైజ్ టాక్స్ 50 వేల లోపు జనాభా ప్రాంతంలో బార్లకు రూ.35లక్షలు, 5 లక్షల జనాభా లోపు రూ.55 లక్షలు, 5 లక్షల జనాభా దాటిన తర్వాత రూ.75 లక్షలుగా నిర్ణయించారు. మూడేళ్లలో ఏటా 10 శాతం ఫీజు పెరుగుతుంది. గీత కులాలకు సంబంధించిన బార్లకు 50 శాతం ఫీజు మాత్రమే వసూలు చేస్తారు.
- లాటరీలో బార్లు చేజిక్కించుకున్న వ్యక్తి లైసెన్స్, ఫీజు (ఆర్ఈటీ) ఆరు వాయిదాలలో కట్టాలి. ఒక వాయిదాకి సంబంధించిన ఫీజు బ్యాంకు గ్యారంటీగా ఇవ్వవలసి ఉంటుంది.
- బార్ నోటిఫై చేసిన ప్రాంతంలో నగర పంచాయతీ/మునిసిపాలిటీకి 3 కి.మీ. బెల్ట్ ఏరియాలో గుడి, చర్చి, మసీదు, బడి, హాస్పిటల్‌కు 100 మీటర్ల దూరం, హైవే వద్ద సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా ఏర్పాటు చేయాలి.
- ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు అమ్మకాలు జరుపుకోవచ్చు.
- రూ.99 అమ్మే అఫోర్డబుల్ మద్యం తప్ప మిగతా గత అన్ని రకాల బ్రాండ్లు, అన్ని రకాల సైజులు, బార్లలో తాగడానికి అనుమతించడం జరుగుతుంది.
- డిపోలలో మద్యం కొనుగోలు చేసేటప్పుడు విధించే ఏఆర్ఈటీ తర్వాత ప్రభుత్వ ఖాతాలో జమ చేయడానికి ఒక యాన్యువల్ ఆర్ఈటీలో ఒక ఇన్‌స్టాల్‌మెంట్‌నకు సంబంధించి బ్యాంకు గ్యారంటీ సెక్యూరిటీగా ఇవ్వవలసి ఉంటుంది.

పంద్రాగస్టు పండగ ముస్తాబు



పంద్రాగస్టు పండగకు జిల్లా ముస్తాబైంది. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల, కళాశాలల్లో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకావిష్కరణ, ప్రభుత్వ పథకాలు ప్రతిబింబించే శకటాలు, సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసు వందనం స్వీకరిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన 400 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు ఇస్తారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలను అధికారులు సత్కరిస్తారు. కలెక్టరేట్ ఆవరణ, జిల్లా పోలీసు కార్యాలయాలను స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు చేశారు.


కలెక్టరేట్ వద్ద ఏర్పాట్లు

- కలెక్టరేట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- జాతీయ పతాకం ఆవిష్కరించనున్న మంత్రి నిమ్మల రామానాయుడు
- ప్రభుత్వ పథకాలతో శకటాలు, స్టాల్స్
- సాంస్కృతిక ప్రదర్శనలు
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

భీమవరం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. కలెక్టర్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న స్థలంలో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ వద్ద నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు జాతీయ జెండా ఎగుర వేస్తారు. పోలీస్ గౌరవ వదనం స్వీకరించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, అనంతరం వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను మంత్రి అందజేస్తారు. 400 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

వేడుకలకు మూడు రోజులుగా ఏర్పా ట్లు చేస్తున్నప్పటికి బుధవారం కురిసిన భారీ వర్షం తో ఇబ్బందులు ఏర్పడ్డాయి. గురువారం కూడా వర్షం కురిస్తే ప్రత్నామ్నాయ చర్యలు ఆలోచించారు. గురువారం ఉదయం నుంచి వాతావరణం అనుకూలంగా ఉండటంతో చకచకా ఏర్పాట్లు చేశారు. మూడు పెద్ద వేదికలు, రెండు చిన్న వేదికలు, గ్యాలరీ, స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రతిబింబించే వివిధ శాఖలకు సంబంధించి 6 శకటాలను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య వేడుకల్లో ప్రోటోకాల్ మేరకు సీటింగ్, స్టేజీ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం పటిష్టంగా ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా అధికారులు ప్రత్నామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం అత్యవసర మందులు, అంబులెన్స్ సిద్ధం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, ప్రజలు తిలకించే విధంగా ఏర్పాటు చేసారు. అల్పపడీన ద్రోణి కారణంగా భారీ వర్షాలు, బలమైన గాలులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వేదిక, స్టాల్స్ ఏర్పాటుచేస్తున్నారు. ఏర్పాట్లను జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వరరావు, అధికారులు పర్యవేక్షించారు.


హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

వసతిగృహ సిబ్బందికి కలెక్టర్ నాగరాణి హెచ్చరిక

తణుకు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వసతిగృహ నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. తణుకు సాంఘిక సంక్షేమ వసతి గృహం గురువారం ఆమె పరిశీలించారు. వర్షం నీరు చేరడంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం సమీప బీసీ కళాశాల బాలికల వసతి గృహనికి విద్యార్థులను తరలించారు. ఆ సమయంలో వసతిగృహ సంక్షేమాధికారి లేకపోవడంతో తహసీల్దార్ అశోక్‌వర్మ, మునిసిపల్ కమిషనర్ రామ్‌కుమార్ పరిస్థితిని చక్కదిద్దడంతో కలెక్టర్ అభినందించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్‌డబ్ల్యూవోను హెచ్చరించారు. అనంతరం తాత్కాలిక వసతి కల్పించిన బీసీ కళాశాల వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడారు. జిల్లా సాంఘిక సంక్షేమాధికారి రామాంజనేయరాజు, వసతిగృహ అధికారి అరుణ, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ, మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పాల్గొన్నారు.

రోగులకు సేవతో కూడిన వైద్యం అందించాలి

రోగులకు సేవతో కూడిన వైద్యం అందించాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఆసుపత్రి అభివృద్ధి పనులు, డ్రెయిన్లు, మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. పలు వైద్య విభాగాలు పరిశీలించి రోగులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. వార్డుల్లో రోగులకు అందుతున్న సేవలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల కొరత, సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.సాయి కిరణ్, ఆర్ఎంవో ఏవీఆర్ఎస్.తాతారావు, పలు విభాగాల వైద్యులు ఉన్నారు.

నేటి నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం



- సాయంత్రం నుంచి అమలు
- ఉదయం టిక్కెట్ కొనాల్సిందే
- ఏర్పాట్లు చేసిన అధికారులు

భీమవరం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం శుక్రవారం సాయంత్రం నుంచి అమలులోకి రానుంది. విజయవాడలో సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ప్రయాణ టిక్కెట్ అందుబాటులోకి వస్తుందని అధికారులు ప్రకటించారు. శుక్రవారం ఉదయం బస్సులో ప్రయా ణించే మహిళలు డబ్బులు చెల్లించి టిక్కెట్ తీసుకోవాలి.

ఏడు నియోజకవర్గాల్లో..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్త్రీ శక్తి పథకాన్నీ శుక్రవారం సాయంత్రం విజయవాడలో ప్రారంభించే సమయంలో జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో మంత్రి, ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారు. వివిధ శాఖల అధికారుల సమక్షంలో ఈ పథకం ప్రారంభిస్తారని జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్‌వీఆర్ వర ప్రసాద్ గురువారం తెలిపారు. పాలకొల్లు బస్సు స్టేషన్ వద్ద మంత్రి నిమ్మల రామానాయుడు, భీమవరం బస్ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, దుంపగడపలో కొత్తగా నిర్మించిన బస్టాండ్ వద్ద డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణ రాజు, మార్టేరు బస్టాండ్ వద్ద ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు బస్ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం బస్ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఉచిత ప్రయాణం ప్రారంభిస్తారని వర ప్రసాద్ తెలిపారు.


తాడేపల్లిగూడెంలో షాపింగ్ మాల్ వద్ద ట్రాఫిక్ మళ్లింపు బోర్డులు

ట్రాఫికర్

- తాడేపల్లిగూడెంలో ట్రాఫిక్ మళ్లింపు
- వాహనదారుల పాట్లు

తాడేపల్లిగూడెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో కొన్నిచోట్ల ట్రాఫిక్ మళ్లింపు చర్యలపై ప్రజలు, వ్యాపారులు మండి పడుతున్నారు. పట్టణంలోని నారాయణ షాపింగ్‌మాల్ సెంటర్ ఇప్పుడు రద్దీగా మారింది. భారీ వస్త్ర దుకాణాలతో నిత్యం రద్దీ నెలకొనడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గణేశ్ నగర్ రోడ్డులో వ్యాపార దుకాణాలు, థియేటర్లు, కళాశాలతో ట్రాఫిక్ సమస్య జఠిలమైంది. వాహనచోదకులు అడ్డదిడ్డంగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనితో పోలీస్‌లు నారాయణ షాపింగ్ మాల్ వద్ద వన్‌వే చేశారు. గణేశ్ నగర్, వస్త్ర దుకాణాలకు వెళ్లే వారు ఆర్టీసీ అవుట్ గేట్ వద్ద టర్న్ తీసుకుని రావాల్సి వస్తుంది. ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు నుంచి వచ్చేవారు పోస్టాఫీస్, జీవిత బీమా కార్యాలయాలకు, కొత్త బ్రిడ్జిపై నుంచి ఏలూరు వైపు వెళ్లేవారికి మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. షాపింగ్ మాల్ చౌరస్తా రద్దీ కారణంగా ప్రమాదాలు, వివాదాలు నిత్యకృత్యం కావడం, వాహనదారులు అడ్డదిడ్డంగా వెళ్లడంతో ట్రాఫిక్ మళ్లించినట్లు పోలీస్‌లు చెబుతున్నారు.

నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోలీస్‌లు ఉండాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు. పట్టణానికి వచ్చేవారు ట్రాఫిక్ నిబంధనలతో షాపింగ్ చేయకుండా వెనుదిరుగుతున్నారని వ్యాపారులు వాపోతున్నారు. నారాయణ షాపింగ్ మాల్ సెంటర్‌లో పోలీస్‌లు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


భీమవరంలో ఆటోడ్రైవర్ల ధర్నా

ఆటోవాలా పొట్ట కొట్టొద్దు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఆటో డ్రైవర్ల నిరసన

భీమవరం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటోడ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణాలు, పలు మండలాల్లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నిరసన వ్యక్తం చేయడంతోపాటు ఆటోలను నిలిపివేశారు. రెండు రోజుల క్రితం జిల్లాస్థాయిలో ఆటో కార్మికులు కలెక్టర్ కార్యాలయం వద్ద వందలాది ఆటోలతో ధర్నా నిర్వహించి వినతి ప్రతం అందించారు. గురువారం భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు పట్టణాల్లో ఆటో కార్మికులు, యజమానులు శిబిరాలను ఏర్పాటుచేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన తెలిపారు. ఆటోలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌లు, బస్టాప్‌ల నుంచి ఇళ్లకు చేరుకోవడానికి తిప్పలు పడ్డారు. బస్సులు కిటకిటలాడాయి. ఉచిత ప్రయాణం అమలుతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయంటూ ఆటో యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

లోపలి పేజీల్లో..



ఉమ్మడి జిల్లాలో
స్వాతంత్ర్య స్మృతులు
గాంధీజీ అడుగు జాడలు
బ్రిటిషర్లకు చుక్కలు చూపిన సుబ్బారెడ్డి



తాపీమేస్త్రి దేశభక్తి
జాతీయ స్ఫూర్తి నింపేందుకు
ఫ్లాగ్ టవర్ నిర్మాణం
నవుడూరు జంక్షన్‌లో 30 అడుగుల కట్టడం

సీబీఐ అధికారి బండి పెద్దిరాజుకు
రాష్ట్రపతి పతకం
పాలకోడేరు మండలం బంటుమిల్లి స్వగ్రామం
సీబీఐ కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితం
ఏఎస్పీగా దేశ రాజధానిలో విధులు



స్వాతంత్ర్య.. స్మృతులు



నవుడూరులో నేషనల్ ఫ్లాగ్ టవర్

తాపీమేస్త్రి దేశభక్తి

జాతీయ స్ఫూర్తిని నింపేందుకు ఫ్లాగ్ టవర్ నిర్మాణం

భీమవరం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఆయన ఒక తాపీమేస్త్రి.. ఆయన దేశభక్తి అభినందనీయం..వీరవాసరం మండలం నవుడూరు జంక్షన్‌కు చెందిన సుబ్బారావు 30 అడుగుల ఎత్తులో నేషనల్ ఫ్లాగ్ టవర్ నిర్మించి అందులో భరతమాత విగ్రహాన్ని పెట్టి తన దేశభక్తి చాటుకున్నారు. దాదాపు 26 సంవత్సరాల క్రితం ఎన్నో వ్యయ ప్రయాసలు పడి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఈ టవర్ నిర్మాణం చేసిన సుబ్బారావు నేటికి ఏదో దేశభక్తి కార్యక్రమం చేపడుతూనే ఉంటారు. అబ్దుల్ కలాం, వివేకానంద విగ్రహాలతో పాటు అన్నం పెట్టే రైతన్న, దేశాన్ని కాపాడే సైనికుల విగ్రహా లను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొందించాలనే ఉద్దేశంతో ఫ్లాగ్ టవర్ నిర్మాణం చేపట్టినట్టు సుబ్బారావు చెబుతున్నారు.

బ్రిటిషర్లకు చుక్కలు చూపిన సుబ్బారెడ్డి

మొదటి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు



కారుకొండ సుబ్బారెడ్డి (ఫైల్ ఫొటో)

బుట్టాయగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మన్యం ప్రాంతంలో బ్రిటిష్ పాలకులను గడగడలాడించి ఉరికంభమెక్కిన మొదటి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు కారుకొండ సుబ్బారెడ్డి. గిరిజన స్వాతంత్ర్య పోరాట యోధుడుగా చరిత్రలో నిలిచిపోయారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఈ పోరాటయోధుడి గురించి తెలిసింది. ఇతని ముని ముని మనుమలు ప్రస్తుతం జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం సమీపంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉంటున్నారు. సుబ్బారెడ్డి గురించి వీరికి ఏమి తెలియకపోవడం గమనార్హం. సిపాయిల తిరుగుబాటుకు ముందే 1852లో ఏజెన్సీ ప్రాంతం కొరుటూరు కేంద్రంగా సుబ్బారెడ్డి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. సుమారు ఆరు సంవత్సరాల పాటు బ్రిటిషర్లను అడవిలోకి అడుగు పెట్టనియ్యలేదు. పది మందితో ప్రారంభమైన ఆయన సైన్యం చివరకు 600 మందికి పెరిగింది. పన్ను వసూళ్ళ రద్దుతో బ్రిటిష్ పాలకులపై పగ పెంచుకున్న సుబ్బారెడ్డి చివరకు తిరుగుబావుటా ఎగురవేశాడు. బ్రిటిష్‌వారిని ఎదిరించిన మొదటి గిరిజన నాయకుడిగా చరిత్రలో నిలిచాడు. అనేకమార్లు బ్రిటిష్‌వారితో జరిగిన పోరాటాల్లో విజయం సాధించాడు. 1852 నుంచి 1858 వరకు బ్రిటిష్ పాలకులను మూడు చెరువుల నీళ్ళు తాగించి ముచ్చెమటలు పట్టించాడు.1858 జూన్ 11న చింతపల్లి దాసిరెడ్డి, మరికొందరి తిరుగుబాటు దారులు ఇచ్చిన సమాచారంతో బ్రిటిషర్లు సుబ్బారెడ్డిని మరికొందరు అనుచరులను నిర్బంధించారు. 1858 అక్టోబరు 7న బుట్టాయగూడెంలో సుబ్బారెడ్డి, కోర్ల సీతారామయ్యలను ఉరితీశారు. అస్థిపంజరాన్ని ఇనుప పెట్టిలో పెట్టి రాజమండ్రిలోని కోటగుమ్మం వద్ద వేలాడదీశారు. 1920 వరకు అస్థిపంజరం అక్కడే ఉన్నట్లు చరిత్రకారుల సమాచారం. ఇతనితో పాటు మరో 10 మందిని ఉరి తీసిన బ్రిటిషర్లు 35 మంది అనుచరులకు జీవిత ఖైదు విధించి గుంటూరు సెంట్రల్ జైలుకు తరలించి మరో 8 మందిని అండమాన్ జైలుకు పంపారు. సుబ్బారెడ్డిని పట్టిస్తే 2500 రూపాయలు ఇస్తామని అప్పట్లోనే బ్రిటిష్‌వారు ప్రకటించారు. ఆయన వారసుడు కారుకొండ అబ్బాయిరెడ్డి ప్రస్తుతం జీలుగుమిల్లి అంకన్నగూడెం సమీపంలో నిర్మించిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉంటున్నాడు. ప్రస్తుతం సుబ్బారెడ్డి వారసులు ఇద్దరు మాత్రమే ఉన్నారు.



సుబ్బారెడ్డి కుటుంబానికి చెందిన కారుకొండ అబ్బాయిరెడ్డి

గాంధీ అడుగు జాడలు

నేడు స్వాతంత్ర్య దినోత్సవం

తిలక్ స్వరాజ్య నిధికి 3 సార్లు ఏలూరు వచ్చిన బాపూజీ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి): భారత దేశస్వాతంత్ర్య సమరం కోసం స్వరాజ్య నిధి పేరిట విరాళాల సేకరణ జోరుగా సాగుతున్న తరుణంలో మహాత్మా గాంధీ ఏలూరు నగరంలో మూడుసార్లు పర్యటించారు. 1921 ఏలూరులో పర్యటించారు. ఏప్రిల్ 3న రాజమహేంద్రవరం నుంచి రైలులో గాంధీ, కస్తూరిబాయ్ దంపతులు ఏలూరు రైల్వేస్టేషన్‌కు విచ్చేశారు. పుర ప్రముఖులు మోతే గంగరాజు జమీందారు, కోమంచి సీతారామయ్య, వల్లూరు రామారావు, ఎర్రమిల్లి గంగయ్య, వారణాసి రామమూర్తి, బడేటి వెంకట్రామయ్యలు పుష్పమాలలు వేసి స్వాగతం పలికారు. రెండు గుర్రాల బగ్గీ మీద ఊరేగింపుగా నగరంలోకి తీసుకువచ్చారు. 50 వేల మందిపైగా వచ్చిన ప్రజలతో ఏఎస్‌ఆర్ స్టేడియం నిండిపోయింది.నగరంలోని కెనాల్ టౌన్‌హాల్‌లో వచ్చి ఆగారు. అక్కడ సభలో గాంధీ మాట్లాడారు. ఇక్కడే తిలక్ స్వరాజ్యనిధికి కారకులైన లోక్‌మాన్య బాలగంగాధర్ తిలక్ చిత్రపటం ఆవిష్కరించారు. దక్షిణపు వీధి మార్కండేయస్వామి గుడిలో పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు.



గాంధీజీ సభ నిర్వహించిన పడమరవీధి గాంధీ మైదానం ప్రాంగణం



ఏలూరు జాతీయ గాంధీ మహా విద్యాలయంలో 1921లో మహాత్మాగాంధీ నాటిన మేడిచెట్టు

మేడిచెట్టు నాటి.. స్కూల్‌కు అంకురార్పణ

మంత్రి ప్రగడ భుజంగరావు అగ్రహారంలోని 3 ఎకరాలు స్థలంను స్కూల్ కోసం దానం చేశారు. దీంతో అక్కడికక్కడే శంకుస్థాపన చేసి చదువులు ఎలా చెప్పాలి ? టీచర్లు ఏ విధంగా నడచుకోవాలన్న దానిపై గాంధీ అవగాహన కల్పించారు. 1921లో ఇక్కడే పలు మొక్కలు నాటగా, అప్పట్లో నాటిన మేడిచెట్టు ఇప్పుడు ఇక్కడ దర్శనమిస్తుంది. అయితే మోడువారి పోయింది. ఈ స్కూల్‌లో గాంధీ విగ్రహాన్ని నెలకొల్పారు.

పడమర వీధిలో బహిరంగ సభ

1929లో ఖద్దర్ యాత్ర ఉద్యమంలో భాగంగా గాంధీ మహాత్ముడు గాంధీ మహావిద్యాలయంలో విడిది చేశారు. టౌన్‌హాల్లో ఏప్రిల్ 23న మొక్కలు నాటారు. రాట్నం వడికారు. అనంతరం పడమర వీధిలో పెద్ద మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. తర్వాత రోజు ఏప్రిల్ 24న పోతు నూరు, కొవ్వలి, దెందులూరు, గుండు గొలను సందర్శించారు. ఏప్రిల్ 25న తాడేపల్లిగూడెం, ఆకివీడు, పెనుమంట్ర, మట్లపాలెం, పాలకొల్లు, తణుకు, చాగల్లు, కొవ్వూరులో పర్యటించిన గాంధీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 1933లో పడమర వీధి భారీ ఖాళీస్థలంలో గాంధీ ప్రసంగం సాగింది. అప్పట్లో ఆయన వచ్చినప్పుడు మైక్‌లు వాడకం ప్రారంభం అయ్యింది. క్రమేణా ఈ స్థలం గాంధీమైదానంగా స్థిరపడింది. ఇక్కడ గాంధీ, కస్తూరిబాయి, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలతో గత స్మృతులకు ఆలవాలంగా ఉన్నాయి. గాంధీ నాలుగోసారి కూడా ఏలూరులో అడుగు పెట్టారు. 1946 జనవరి 26న కోలకతా నుంచి మద్రాస్ వెళుతున్నప్పుడు ఆయన ఏలూరు రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు ఆగారు.



స్వాతంత్ర్య సమర యోధుల పార్కు

తణుకు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతోమంది తణుకు గడ్డ నుంచి పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు దూరంగా రహస్య జీవితం గడిపిన వారు ఉన్నారు. మరికొంత మంది సంవత్సరాల తరబడి జైలు జీవితం గడిపారు. అటువంటి మహానుభావులను స్మరించుకోవడానికి తణుకు బ్యాంకు కాలనీలోని పార్కు వద్ద మున్సిపాల్టీ స్వాతంత్ర సమరయోధుల పార్కును ఏర్పాటు చేశారు. నేటి తరాల వారికి వారి సేవలను నిత్యం గుర్తు ఉండేలా దోహదపడాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. కోడూరి రామరాయ వర్మ, నడింపల్లి తిరుపతిరాజు, సంకురాత్రి సుబ్బారావు, శనివారపు సుబ్బారావు, కొవ్వలి గోపాలరావు, కొవ్వల కనకమ్మ, ముదిగంటి జగ్గన్న శాస్త్రి, చెరుకువాడ వెంకట నరశింహం పంతులు, యర్రమిల్లి రామనాథం, సంకు అప్పారావు, వంక సత్యనారాయణ, భూపతిరాజు సుబ్బరాజు, కలిదిండి పెద సుబ్బరాజు, నూరంపూడి మహాలక్ష్మి, అజ్జరపు సుబ్బారావు, యర్రమిల్లి నరశింహారావు, కత్రంపల్లి సుబ్బారావు, చల్లా అప్పారావుల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

మహాత్ముని ఆశయాలకు ప్రతీక.. పెదనిండ్రకొలను గాంధీ భవనం

నిడమర్రు ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) మహాత్ముని ఆశయాలను సామాన్య ప్రజానీకానికి తెలియజేయాలనే లక్ష్యంతో మాజీ విద్యామంత్రి, సర్వోదయ మండలి నాయకుడు దివంగత చింతలపాటి వరప్రసాదమూర్తి రాజు గాంధీభవనం నిర్మించారు. 1967లో నిర్మాణం ప్రారంభించగా రెండు సంవత్సరాల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ మహత్తర నిర్మాణం చూపురులను విశేషంగా ఆకట్టుకుంటుంది. గాంధీజీ ప్రవచించిన సత్యం, అహింస, స్వదేశీ విధానాలను ప్రజలకు, భవిష్యత్తు తరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో మూర్తిరాజు సుమారు 12 ఎకరాల పొలం పెదనిండ్రకొలనులో సేకరించి ఈ గాంధీభవనం నిర్మించారు. భారత పార్లమెంటు భవనాన్ని పోలిన విధంగా దీన్ని నిర్మించారు. ఈ భవనం ప్రత్యేకత ఏమిటంటే భవనం మధ్యలో ఎటువంటి పిల్లర్లు లేకుండా ఉండడం. సుమారు 100 అడుగులు మేర ఎటువంటి సపోర్టు లేకుండా ఏక స్లాబ్ ఉండడం ఆశ్చర్యం కల్గిస్తోంది. 60 సంవత్సరాల క్రితమే ఏ విధమైన టెక్నాలజీ లేని సమయంలో ఈ నిర్మాణం జరగడం అద్భుతమని చెబుతుంటారు. ఇంకో విశేషం ఏమిటంటే ఈ భవనం చుట్టూ వరండాలో పైన మొదటి అంతస్తులో అద్భుతమైన గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అప్పట్లోనే మూర్తిరాజు సుమారు నాలుగు వేల గ్రంథాలను, జీవిత చరిత్రలను, స్వాతంత్ర పోరాట పుస్తకాలను సేకరించి భద్రపరిచారు. మరో విశేషమిటంటే గాంధీ భవనం లోపల గోడలపై స్వాతంత్ర్య పోరాట దృశ్యాలను 3డి రూపంలో బొమ్మలను ఏర్పాటు చేశారు. నూలు వడికే యంత్రంతో , స్వదేశీ ఉద్యమం పోరాట దృశ్యాలు అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ భవనాన్ని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసేందుకు ప్రయత్నస్తున్నామని సర్వోదయ మండలి రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు.



ముంచిన వాన !

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. డ్రెయిన్లు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. ఎడతెరపి లేకుండా బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలతో జన జీవనం స్తంభించింది. భారీ వర్షాలకు ఏజన్సీలో రహదారులు ఛిద్రమయ్యాయి.



తాడేపల్లిగూడెంలోని పాతూరు ఎస్సీ ఏరియాలో నిలిచిన నీరు

తాడేపల్లిగూడెం 14 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెంలో పట్టణంలో 162.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా అత్యధికంగా తణుకులో 236.6 మిల్లీమీటర్లు, ఇరగవరంలో 196.6 మిల్లీమీటర్లు, పెనుగొండ 193.8 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. అత్యల్పంగా మొగల్తూరులో 8.8 మిల్లీమీటర్లు నమోదైంది. జిల్లా వ్యాప్తంగా నిన్న ఒక్కరోజునే సగటు వర్షపాతం 90 మిల్లీమీటర్లు నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణానికి ఆనుకుని తాళ్లముదునూరుపాడు, యాగర్లపల్లి, కడకట్ల ప్రాంతాల్లోని వరిపొలాలు నీటమునిగాయి. యాగర్లపల్లి, వీకర్స్‌కాలనీ, పాతూరులోని ఎస్‌సీ ఏరియాలోని కొన్ని ప్రాంతాల్లోని వీధుల్లో ఇంకా నీరు వెళ్లే మార్గంలేక డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. పాతూరులోని తాడేపల్లిచెరువు వద్ద డ్రైనేజ్ పొంగిపొర్లి నీరు పోయే మార్గంలేక వీధుల్లోకి నీరు చేరింది. జేసీబీ సహా యంతో డ్రైనేజ్‌లో పేరుకుపోయిన చెత్త తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు.

వయ్యేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తివేత

తణుకు రూరల్ : తణుకు మండలంలోని మండపాక, ఎర్రనీలి గుంట, దువ్వ, కొమరవరం, తేతలి గ్రామాలోని పల్లపు పొలాల్లోని వరి పంట నీట మునిగింది. తణుకు మండలం మండపాక, వరిగేడు సరిహద్దులోని పంట కాలువ గట్టు మట్టి మాఫియా తవ్వేయడంతో రాత్రి కురిసిన భారీ వర్షానికి నీటి ప్రవాహం పెరగడంతో గట్లపై బడి మురుగునీరు ప్రవహించి పంటచేలను ముంచెత్తిందని రైతులు చెబు తున్నారు. కాలువ గట్లను పటిష్టం చేయాలని రైతులు కోరుతున్నారు. ఎర్రకాలువ వరద నీటిని కిందికి పోయే విధంగా తణుకు మండలం దువ్వ వయ్యేరు రెగ్యులేటర్ వద్ద గేట్లను ఎత్తివేశారు.



మండపాకలో పంటకాలువ గట్లపై ప్రవహిస్తున్న నీరు... దువ్వలో నీట మునిగిన పంట పొలాలు



పెనుగొండలో మునిగిన చేలు

ఉధృతంగా నక్కల కాలువ

పెనుగొండ : పెనుగొండ మండలంలోని పలు గ్రామాల్లో వరి నారుమడులు చెరువులను తలపించాయి. చేలల్లోని నీరు ఎటూ పారకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంట కాలువలు పొంగి పొర్లుతున్నాయి. పంట కాలువ, చేలు కలిసిపోయి చెరువులను తలపిస్తున్నాయి. పెనుగొండలో నక్కల కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నది.

నేలకొరిగిన భారీ వృక్షాలు

ఆకివీడు : ఈదురు గాలులకు బుధవారం అర్ధరాత్రి రెండు భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఆకివీడు సాలిపేట పెద్దవీధిలో వేపచెట్టు విరిగిపడింది. అందేవారి బోదె గట్టుపై భారీ రావిచెట్టు విద్యుత్ తీగలపై పడింది. విద్యుత్ అధికారులు మరమ్మత్తులు చేసి కరంటు పునరిద్ధరించారు. మండలంలో 194 ఎకరాలు, పట్టణ పరిధిలో 65 ఎకరాలు నీట మునిగినట్లు అధికారులు చెపుతున్నారు.



ఇరగవరంలో చెరువులా వరి పొలాలు

ముంపులో పొలాలు.. రైతుల కలవరం

పెంటపాడు/ ఇరగవరం/గణపవరం /పాలకోడేరు/ ఉండి : పెంటపాడు మండలంలోని కే.పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ళ, బోడపాడు , రావిపాడు తదితర గ్రామాలలో వరిచేలు నీట మునిగాయి. బోడపాడు లో లెవిల్ కాలువకు గండి పడటంతో రావిపాడులో కొన్ని పొలాలు ముంపునకు గురయ్యాయి. తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఏవో చీర్ల రవికుమార్‌లు పొలాలను పరిశీలించారు. వర్షాలు ఇంకా కురిస్తే నాట్లు కుళ్ళి పోయే ప్రమాదం ఉందని పెంటపాడుకు చెందిన రైతు పీతల సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశాడు. ఇరగవరం మండలంలో 3,200 ఎకరాల్లో పంట మునిగినట్లు వ్యవసాయాధికారి రాఘవేంద్రరావు వెల్లడించారు. కావలిపురం, ఇరగవరం, అర్జునుడుపాలెం, రేలంగి గ్రామాలలోని వరి చేలు చెరువులుగా మారాయి. నీటిని బయటకు పంపేందుకు నానా అవస్థలు పడ్డారు. గణపవరం మండలంలోని 25 గ్రామాలకు గాను 14 గ్రామాల్లో వరిపొలాలు ముంపునకు గురయ్యాయి. ముంపు పొలాలను మండల వ్యవసాయాధికారులు పరిశీలించారు. మరో రెండురోజులు వర్షాలు రాకుండా ఉండాలని రైతులు ఆకాశం వైపు చూస్తూ వరుణదేవున్ని ప్రార్థిస్తున్నారు. పాలకోడేరు మండలం మోగల్లు శివారు గుత్తులవారిపాలెంలో గోస్తనీనది పొంగి పొలాల్లోకి నీరు ఎగదన్నడంతో పొలాలు మునిగాయి. ప్రతి ఏటా ఈ గ్రామాన్ని చేర్చి ఉన్న గోస్తనీ నది పొంగుతూ ఉండటంతో ఏదో ఒకచోట గండిపడుతూనే ఉంటుంది. ఈ ఏడాది కూడా గోస్తనీ నది పొంగిపొర్లడంతో ఆ ప్రాంత రైతులు ఒక్కసారిగా కంగారుపడి పంట పొలాల్లోకి వెళ్ళే తూములను కట్టేసుకున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



పోలవరంలో గురువారం జోరు వాన

పోలవరం /ఉంగుటూరు/భీమడోలు : పోలవరంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది.వర్షానికి గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం పంచాయతీలలో ఏటి గట్టుకి దిగువన ఉన్న పల్లపు ప్రాంతాలు మేజర్ డ్రైనేజీలు లేక జలమయ మయ్యాయి. ఉంగుటూరు మండలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఏలూరు కాల్వ నీటి మట్టం ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నది. భీమడోలు మండలంలో భీమడోలు, పూళ్ళ, గుండుగొలను తదితర గ్రామాల్లో భారీ వర్షానికి డ్రైనేజీలు పొంగి పొర్లాయి. మండల వ్యాప్తంగా 350 ఎకరాల్లో వరి సాగు నీట మునిగాయి. గురువారం వర్షం లేకపోవడంతో రైతులు ఊరిపి పీల్చుకున్నారు. ప్రస్తుతం వరికి ఇబ్బంది లేదని ఏవో ఉషారాణి తెలిపారు.



వంకవారిగూడెం వద్ద కొట్టుకుపోయిన ఆర్‌అండ్‌బీ రహదారి

కొట్టుకుపోయిన రహదారులు

జీలుగుమిల్లి/ టి.నరసాపురం : కుండపోతగా కురిసిన వర్షంతో గిరిజన ప్రాంతంలో చెరువుల్లో జలకళ కన్పిస్తోంది. బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో చిన్న చిన్న ఆయకట్టు చెరువులు నిండాయి. దీంతో మెట్ట ప్రాంతంలో వర్షాధారంగా వేసే వరినాట్లు ఊపందుకున్నాయి. తెలంగాణ నుంచి వచ్చే అశ్వారావుపేటవాగు పొంగి ప్రవహించటంతో వంకవారిగూడెం సమీప వాగు వద్ద ఆర్‌అండ్‌బీ రహదారికి గండిపడింది. దీంతో సమీప గిరిజన గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చే వీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రాచన్నగూడెం, జిల్లెళ్ళగూడెం, బొత్తప్ప గూడెం, మడకం వారిగూడెం, కొత్తపండువారిగూడెం, చీమలవారిగూడెం ప్రాంతాల్లో గిరిజన గ్రామాల్ని కలిపే రహదారులు వరదనీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. టి.నరసాపురం మండలం ముగ్గురాల వాగు పొంగి ప్రవహిస్తోంది. బండివారిగూడెం, మక్కినవారిగూడెం గ్రామాల మధ్య టి.నర్సాపురం, మక్కినవారిగూడెం గ్రామాల మధ్య దుర్గమ్మగుడి వద్ద ముగ్గురాలవాగు పొంగి ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తహసీల్దార్ సాయిబాబా, హెడ్‌కానిస్టేబుల్ రాజు, రెవెన్యూ సిబ్బంది వాగును పరిశీలించారు.



ముగ్గురాల వాగు పరిశీలిస్తున్న తహసీల్దార్

మొగల్తూరులో సార్వా ఊడ్పులు

మొగల్తూరు: మొగల్తూరు మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ 16.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా కురవడం, సాగునీరు సక్రమంగా అందకపోవడంతో ఆలస్యమైన సార్వా పనులు రెండు రోజులుగా ఊపందుకున్నాయి. ప్రతీ ఏటా మండలంలో సుమారు 2 వేల ఎకరాలు పైబడి వరిసాగు చేసే రైతులు ఈఏడాది మొగల్తూరు, రామన్నపాలెం పంచాయతీ అడవిపర్ర, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో 690 ఎకరాల్లో మాత్రమే సాగు చేపడుతున్నట్టు మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ పేర్కొన్నారు.మండలంలోని గొంతేరు, వెస్ట్‌కుక్కులేరు, ఈస్ట్ కుక్కులేరు, దర్భరేవు డ్రెయిన్‌లు పొంగిపొర్లుతున్నాయి.



బీచ్‌కు రావద్దు



మొగల్తూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాబోయే మరో నాలుగు రోజలు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పేరుపాలెం బీచ్‌కు పర్యాటకులకు అనుమతించడం లేదని ఎస్ఐ జి.వాసు ఒక ప్రకటనలో తెలి పారు. సముద్ర అలలు ఎగసిపడే అవకాశం ఉన్నందున పర్యాటకులను అనుమతించడం లేదని తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకూ రావద్దని ఎస్ఐ సూచించారు.

విజిలెన్స్ ఎస్ఐ సీతారామ్‌కు ఇండియన్ పోలీస్ మెడల్



ఏలూరు క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఎస్ఐగా పనిచేస్తున్న కరిమికొండ సీతారామ్‌కు కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డును ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన పోలీస్ మెడల్, ప్రెసిడెంట్ మెడల్ అవార్డులలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్ఐ సీతారాము ఒక్కరే ఉన్నారు. బుట్టాయిగూడేనికి చెందిన దుర్గారావు, నాగమణి దంపతుల కుమారుడైన సీతారామ్ 1984 జనవరి 13న కానిస్టేబుల్‌గా పోలీస్‌శాఖలో చేరారు. 2019 జూన్ 3న ఎస్ఐగా పదోన్నతి లభించింది. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. పెరవలి పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య చేసి సొత్తు ఎత్తుకుపోయిన కేసు, 70 లక్షల విలువైన గంజాయి కేసు గుర్తించడం, అమాయక ప్రజలను మోసగించిన కేసులను ఛేదించడంలో ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో పనిచేస్తూ ఆహారం కల్తీ కేసుల్లో నూనెలు, టీపొడి, బాదంపొడి, నెయ్యి, బెల్లం తయారీలో కల్తీ వస్తువులను సుమారు 5.76 కోట్ల విలువైన వాటిని సీజ్ చేయించగలిగారు. ఇప్పటి వరకూ ఆయనకు 157 నగదు బహుమతులు, 12 గుడ్ సర్వీసు ఎంట్రీలు, ఒక ప్రశంసాపత్రం, సేవా పతకం, ఉత్తమ పతకం, అతిఉత్కృష్ట సేవా పతకం అందుకున్నారు. ప్రస్తుతం ఆయన చేస్తున్న సేవలకు కేంద్ర ప్రభుత్వం గుర్తించి స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఇండియన్ పోలీస్ మెడల్‌ను ప్రకటించింది. విజిలెన్సు ఇన్‌ఛార్జి ఎస్పీ మహేష్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు శివరామకృష్ణ, ప్రసాదకుమార్ అభినందించారు.

సీబీఐ అధికారి బండి పెద్దిరాజుకు రాష్ట్రపతి పతకం



పాలకోడేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) :పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామ పంచాయతీ పరిధిలోని బంటుమిల్లి గ్రామానికి చెందిన సీబీఐ అధికారి బండి పెద్దిరాజు రాష్ట్రపతి పోలీసు పతకానికి ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన న్యూఢిల్లీ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ప్రధాన కార్యాలయం సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్ డివిజన్‌లో అదనపు పోలీసు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2025 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశిష్ట సేవకు రాష్ట్రపతి పోలీసు పతకం లభించింది. పోలీసు దళం లేదా కేంద్ర పోలీసు, భద్రతా సంస్థలలో అసాధారణమైన సేవా రికార్డును ప్రదర్శించే వ్యక్తులకు ఈ పతకం ఇస్తారు. 1993లో సీబీఐలో కానిస్టేబుల్‌గా చేరారు. ఇప్పటి వరకు ఆయన 150 పైబడి రివార్డ్స్ అందుకున్నారు. స్వగ్రామమైన బంటుమిల్లిలో విద్యా ట్రస్ట్ పేరుతో సేవలందిస్తున్నారు. 32 ఏళ్ళ సర్వీసులో పెద్దిరాజు 1997లో ఎస్ఐ, 2003లో ఇన్‌స్పెక్టర్, 2016లో డిప్యూటీ ఎస్పీ, 2023లో అడిషనల్ ఎస్పీ అయ్యారు.ఇటీవల ఆయన నీట్ యూజీ 2024 ప్రశ్నాపత్రం లీకేజ్ కేసులో చీఫ్ ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్‌గా పని చేశారు. అక్కడ ఆయన ప్రయత్నాలు 45 మంది నిందితులను అరెస్ట్ చేయడానికి, సమగ్ర చార్జిషీట్‌లను దాఖలు చేయడానికి దారితీశాయి. ఆయన్ని రాష్ట్రపతి పోలీస్ పతకం వరించడంతో బంటుమిల్లి గ్రామస్తులు అభినందించారు.



ఏపీ నిట్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

ప్రతి ఒక్కరూ దేశ భక్తిని అలవర్చుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) :ప్రతీ ఒక్కరూ దేశ భక్తిని అలవర్చుకోవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఏపీ నిట్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించి భారత్‌మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగుర వేయాలన్నారు. కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసన్ వ్యవహరించగా ఆచార్యులు డాక్టర్ రాజేశ్వరరెడ్డి, డాక్టర్ సునీల్, సాస్ అసిస్టెంట్లు సంధ్య, సాయిరాం పాల్గొన్నారు



ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రిలో దివ్యాంగులకు కాలిపర్స్ పంపిణీ చేస్తున్న ఈవో మూర్తి, ఎస్‌బీఐ ఆర్‌ఎం కాళిదాసు

విర్డ్ ఆసుపత్రి సేవలు భేష్

ద్వారకాతిరుమల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల విర్డ్ ఆసుపత్రి ద్వారా రోగులకు అందుతున్న సేవలు ప్రసంశనీయమని శ్రీవారి దేవస్థానం ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి అన్నారు. విర్డ్ ఆసుపత్రిని గురువారం ఆయన, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కాళిదాసులు పరిశీలించారు. వైద్యసేవలు, రోగులకు అందుతున్న సేవలు, సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత మెరుగ్గా ఉందని కితాబిచ్చారు. అనంతరం గుప్తా సహకారంతో తయారైన కాలిపర్స్‌ను పలువురికి అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, నాగేంద్ర బాబు, సింధు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

భీమవరం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయ ధర్మాదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. భీమవరం పట్టణంలో ఉన్న మావుళ్ళమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యులను నియమించేందుకు హిందూ మతానికి చెందిన 13 మందిని ధర్మకర్తల మండలి సభ్యులుగా నియమిస్తారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వారి దరఖాస్తులను ఆలయ కార్యాలయంలో అందజేయవచ్చు. వివరాలకు దేవస్థానం కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. శ్రావణ మాసం శుక్రవారం పురస్కరించుకుని ఆలయంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న మానవ హక్కుల సంఘం చైర్మన్ దంపతులు



మావుళ్ళమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవహక్కుల సంఘం చైర్మన్ వెంకట రమణ దంపతులు దర్శించుకున్నారు. వారికి అర్చకులు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు కొడమంచిలి కొప్పేశ్వరరావు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరుపున ఈవో శేషవస్త్రం, ప్రసాదాలు అందించారు.



గిట్టుబాటు ధరలు లేక తమ బేళ్లను వెనక్కి తీసుకువెళ్తున్న రైతులు

గత ఏడాది ఆశాజనకంగా ఉన్న పొగాకు ధరలు ఈ ఏడాది రివర్స్ విధానంలో కొనసాగుతున్నాయి. మార్చిలో రూ.290 తో ప్రారంభమైన పొగాకు ధరలు జూలై చివరిలో రూ.390 వరకు పెరిగింది. రూ. వంద పెరగడానికి నాలుగు నెలలు పడితే నెల రోజుల్లోగానే రెండు సార్లు రూ.40 తగ్గింది. గత నెల 26వ తేదీ శనివారం రూ.390 నుంచి రూ.370 కు పడిపోగా, ఈ నెల తొమ్మిదో తేదీ శనివారం రూ.370 నుంచి 350 కి పడిపోయింది. ధరలిలా తగ్గిపోతుంటే వచ్చే ఏడాది పంట పండించేందుకు రైతులెవరూ ముందుకు రారని రైతు సంఘ నాయకులు అంటున్నారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే చేసిన అప్పులు తీర్చలేక, కౌలు చెల్లించలేక వారికి ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

పొగాకు పండించలేం..

»వారం వారం ధరలు తగ్గిస్తున్న వైనం »కంపెనీలు సిండికేట్?

» ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు



వేలం కేంద్రం వద్ద వేలంలో పాల్గొన్న పొగాకు కంపెనీల ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వర్జీనియా పొగాకు ధరలను మునుపెన్నడూ లేని విధంగా పొగాకు కొనుగోలు కంపెనీలు సిండికేట్ అయి తగ్గించేశాయని పొగాకు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి శనివారం కిలో పొగాకుకు రూ.20 తగ్గిస్తూ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన కంపెనీల ప్రాతినిధ్యం

వేలం ప్రారంభంలో 35 నుంచి 40 కంపెనీలు వేలంలో పాల్గొనగా ప్రస్తుతం పది కంటే తక్కువ కంపెనీలు మాత్రమే పొగాకు కొనుగోలు చేస్తున్నాయి. నూటికి 90 శాతం కంపెనీలు మేలు రకం పొగాకును మాత్రమే కొనుగోలు చేస్తుండగా అతి తక్కువ కంపెనీలు మాత్రమే ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి పొగాకును కొనుగోలు చేస్తున్నాయి. గత నెలలో క్వాలిటీ పొగాకు ధర రూ.390 ఉండగా బుధవారం అదే పొగాకు ధర రూ.340కు పడిపోయింది. దీంతో క్వాలిటీ పొగాకును తక్కువ ధరకు అమ్మడం ఇష్టం లేక చాలా మంది రైతులు తమ బేళ్లను వెనక్కి తీసుకుపోయారు. లో-గ్రేడు పొగాకు ధర రూ.200కు మించడం లేదు.

అదనంగా పండించారన్న సాకుతో..

రైతులు అదనంగా పండించిన పొగాకును గత ఏడాది ఎటువంటి పెనాల్టీ లేకుండా కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో రైతులకు ఊరట కలిగింది. ఈ ఏడాది కూడా రైతులు పొగాకు పంటను అదనంగా పండించారు. ప్రభుత్వం ఇప్పటివరకు అదనపు పంట కొనుగోలుపై ఎటువంటి సంకేతాలు ఇవ్వలేదు. ఇదే అదునుగా భావించిన కంపెనీలు ధరలు తగ్గించేస్తున్నాయి. ఎంత తక్కువ ధర ఉన్నా తప్పనిసరిగా రైతులు పొగాకును అమ్ముకోవాల్సిందేనని, వేరే దారి లేదనే ఉద్దేశ్యంతో కంపెనీలు ఉన్నాయి. ఆ ఉద్దేశ్యంతోనే ప్రతి శనివారం రూ.20 తగ్గించుకుంటూ చివరికి రూ.300 వరకు స్థిరంగా ఉంచుతాయనే సంకేతాలు రైతులకు పంపుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వాలు రైతుల గోడును పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విదేశాల నుంచి సరైన ఆర్డర్లు రాకపోవడంతోనే పొగాకును కొనుగోలు చేయడానికి కంపెనీలు ఆసక్తి చూపించడంలేదని కంపెనీల ప్రతినిధులు రైతులకు చెబుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్రస్తుతం పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు చివరి వరకూ ఉంటాయా లేదా అనే సందేహం రైతుల్లో నెలకొంది. కొంచెం కొంచెంగా ధరలు పతనం చేయడానికి కంపెనీలు పూనుకున్నాయని రైతులు మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వం, పొగాకు బోర్డు అధికారులు వెంటనే స్పందించి గిట్టుబాటు ధరలు కల్పించకపోతే తాము తీవ్ర నష్టాల్లో కూరుకుపోయే పరిస్థితి నెలకొంటుందని రైతులు వాపోతున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం



కంపెనీలన్నీ సిండికేట్ అయ్యాయి. ప్రతి శనివారం రూ. 20 తగ్గిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న క్వాలిటీ పొగాకు ధరను ఇంకా తగ్గించడానికి కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. మార్చి నెలలో వేలం ప్రారంభమైనా ఇప్పటికీ తమ వద్ద ఉన్న లో-గ్రేడు పొగాకును కంపెనీలు కొనడంలేదు. క్వాలిటీ పొగాకు ధరలు కూడా వారం తగ్గిపోతున్నాయి. ఈ ధరలు ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాది వ్యవసాయం చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరలు కల్పించాలి. లేదంటే ఆత్మహత్యలే శరణ్యం.

-పెండ్యాల రాజేంద్ర ప్రసాద్,
రైతు సంఘ నాయకుడు,
మధ్యాహ్నపువారిగూడెం

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

ఏలూరు క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా మీదుగా నడుస్తున్న రెండు ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్టు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే శాఖాధికారులు ప్రకటించారు. రైల్ నంబర్ 07031 చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్‌కు ప్రతి శుక్రవారం రాత్రి 7.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. ఈ రైలు ఆగస్టు 15, 22, 29 తేదీల్లో నడుస్తుంది. రైల్ నంబర్ 07032 కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లి ప్రతి ఆదివారం రాత్రి 8.10 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైలు ఆగస్టు 17, 24, 31 తేదీల్లో నడపనున్నారు. ఈ రెండు రైళ్ళు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్ళల్లో టూ టైర్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్, జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని అధికారులు తెలిపారు.



అవగాహన పోస్టర్లను ప్రదర్శించి ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

డ్రగ్స్ రహిత సమాజం అందరికీ క్షేమం

భీమవరం క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజం మనందరికి క్షేమమని, క్షణికంగా అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ బలరామరాజు అన్నారు. ఈగల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం భీమవరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ బలరామరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువతపై తీవ్ర ప్రభావం చూపుతుందని, గంజాయి రవాణా, వినియోగం, ఇతర మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపామని అన్నారు. ఈగల్ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రైల్వే, ఆర్టీసీ బస్సుల్లో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి అవగాహన పోస్టర్లను పెట్టాలన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

సారా కేసులో ఒకరికి రిమాండ్

చింతలపూడి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిగూడెం గ్రామంలో సారా కేసులో పలు సార్లు పట్టుబడిన వడిత్యా రామదాసును అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో అతడిని రాజమహేంద్రవరం జైలుకు తరలించినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్‌లో తాను లేని సమయంలో నిందితుడు రాందాసు భార్య, మరో ఐదుగురు కార్యాలయంపై దాడి చేశారన్నారు. ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి మహిళా కానిస్టేబుల్‌పై చెయ్యి చేసుకున్నారని, ఈ ఆరుగురిపై దాడి కేసు నమోదైందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పెదపాడు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న టాటాఏస్ ఆటో సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న మోటారు సైకిలిస్ట్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. బొమ్ములూరుకు చెందిన మట్టా నాంచారయ్య మోటారు సైకిల్‌పై ఏలూరు వైపు మరోవ్యక్తితో కలిసి వెళుతుండగా టోల్‌గేట్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. గాయపడిన నాంచారయ్యను చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. మరో కేసులో విజయవాడ శ్రీనివాసనగర్‌కు చెందిన కొండపల్లి మంగరాజు తన భార్య, కుమారుడితో కలిసి గురవాయిగూడెంలోని పెదకుమారుని ఇంటికి వెళుతుండగా ముందు వెళుతున్న టాటాఏస్ ట్రక్కు డ్రైవర్ సడన్‌గా యుటర్న్ చేయడంతో వెనుక నుంచి వచ్చి ఢీకొన్నాడు.గాయపడిన మంగరాజును చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీష్, ఏఎస్సై గజపతిరావులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనాన్ని భరించలేక వ్యక్తి ఆత్మహత్య

టి.నర్సాపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనాన్ని భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కె.జగ్గవరంలో గురువారం చోటు చేసుకుంది. మండలంలోని కె.జగ్గవరం గ్రామానికి చెందిన బర్రె రాజేశ్(35) పదేళ్ల క్రితం తన పెద్దక్క కుమార్తెను వివాహం చేసుకున్నాడు. పెళ్లి అయిన నెలరోజులకే ఆమె వెళ్లిపోయింది. ఈ నేపద్యంలో రాజేశ్ తల్లి వద్ద ఉంటున్నాడు. అతనికి చిన్నప్పటి నుంచి కొంచెం మతిస్థిమితం సరిగా లేకపోవడంతో అప్పుడప్పుడు మూర్ఛవచ్చేదని ఒంటరి జీవితాన్ని భరించలేక ఈ నెల 13న విషం తాగడంతో స్థానికులు గుర్తించి చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజేశ్ సోదరుడు ఏలియా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముదినేపల్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి-గుడివాడ రహదారిలో కల్వపూడి సత్రం సమీపంలో ఈ నెల 4వ తేదీ రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలకు గురైన వడాలికి చెందిన నూలు వెంకట వరలక్ష్మి(55) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదానికి గురైన ఈ మహిళను గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

డబ్బు తీసుకుని మోసగించిన వ్యక్తిపై కేసు

మొగల్తూరు, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి):సింగపూర్‌లో జీవనోపాధి పొందుతున్న తనను నమ్మించి తన వద్ద ఉన్న డబ్బును అప్పుగా తీసుకున్న వ్యక్తిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు. విశాఖలోని హరిలోవ కాలనీకి చెందిన రాయి శాంతి అనే 30 ఏళ్ల యువతి జీవనోపాధికై సింగపూర్ వెళ్లింది. మొగల్తూరు మండలం కొత్తకాయలతిప్పకు చెందిన ఒక వ్యక్తి ఆమెకు పరిచయమై నమ్మించి ఆమె వద్ద ఉన్న డబ్బులు అప్పుగా తీసుకున్నాడు.దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులు కొత్తకాయలతిప్ప గ్రామంలోని మోసగించిన వ్యక్తిని అతని కుటుంబ సభ్యులను డబ్బు ఇవ్వమని అడగగా ఆవ్యక్తి కుటుంబ సభ్యులు బాధితురాలు కుటుంబ సభ్యులపై కులం పేరుతో దూషించారన్నారు. దీంతో బాధితురాలు విశాఖలో ఫిర్యాదు చేయగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌గా కేసు నమోదు చేసి మొగల్తూరు స్టేషన్‌కు బదిలీ చేశారన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

గోడ కూలి యువకుడి మృతి



మృతి చెందిన సాయి

ఏలూరు క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): టిప్‌టాప్ షామియానాలో పనిచేసే ఒక యువకుడు శంకుస్థాపన కార్యక్రమం వద్ద వేసిన టెంటును తీయడానికి గోడ ఎక్కగా ఆ గోడ కూలి అతడిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరులోని బీడీ కాలనీ గట్టు ప్రాంతానికి చెందిన కూనకృష్ణసాయి(23)తంగెళ్లమూడిలోని ప్రసాద్ టిప్‌టాప్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తంగెళ్లమూడి బ్రిడ్జి సమీపంలో ఒక షాపు నిర్మాణం కోసం బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అక్కడ ప్రసాద్ టెంట్లను తీసుకొచ్చి వేశాడు. తిరిగి వాటిని తీసుకువెళ్ళే నిమిత్తం గురువారం మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో వచ్చి వాటిని విప్పడానికి పక్కనే ఉన్న గోడ ఎక్కాడు. ఆ గోడ నానిపోయి ఉండడంతో అకస్మాత్తుగా పడిపోతుండగా అతను కిందకు దూకేశాడు. అయితే గోడకిందపడటంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమకు న్యాయం చేయాలంటూ బంధువులు సంఘటనా స్థలంలోనే కొద్దిసేపు ఆందోళన చేశారు.

హుండీల దొంగ దొరికాడు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

నూజివీడు టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో హుండీ దొంగతనాలు చేస్తున్న అంతర్ జిల్లా దొంగను నూజివీడు సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ వివరాలు ప్రకారం రాత్రి వేళల్లో ఆలయాల్లోకి ప్రవేశించి హుండీ తాళాలు పగల గొట్టి నగదును దొంగలించే ఏలూరుకు చెందిన తాజ్‌ఖాన్ కుమారుడు పఠాన్ సలార్ ఖాన్‌ను గురువారం అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. చాట్రాయిలోని కొత్త ఆంజనేయ స్వామి గుడి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలవరం నుంచి చాట్రాయికి మోటార్‌సైకిల్‌పై వస్తున్న సలార్‌ఖాన్ పోలీసులను గమనించి పారిపోవడానికి యత్నించాడు. చాట్రాయి ఎస్ఐ డి.రామకృష్ణ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ.5,900 నగదు, మోటార్ సైకిల్‌ని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై ఇప్పటి వరకు వివిధ జిల్లాల్లో మొత్తం 51 చోరీ కేసులు ఉండగా ఏలూరు జిల్లాలో 25, నెల్లూరు జిల్లాలో 23, ఎన్టీఆర్ జిల్లాలో మూడు కేసులు ఉన్నాయన్నారు. నిందితుడి స్వస్థలం ఏలూరు అయినా ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో నివాసం ఉంటున్నట్టు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ విజయ్‌భాస్కర్, శ్రీనివాసరావు, కానిస్టేబుల్ బాలాజీ, శ్రీనివాసులను డీఎస్పీ అభినందించారు. నూజివీడు సీఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పెదకాపవరంలో ఇంట్లో చోరీ

ఆకివీడు రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పెదకాపవరంలోని సత్యనారాయణ పురంలోని ఇందుకూరి సూర్యనారాయణ రాజు నివాసంలో చోరీ జరిగింది. ఆరు కాసుల విలువైన బంగారు ఆభరణాలు దొంగిలించినట్టు గుర్తించారని పోలీసులు తెలిపారు. ఈనెల 13న పిప్పర తమ బంధువులు నివాసానికి వెళ్లి 14న ఉదయం వచ్చే సరికే తలుపు తెరిచి లాకర్ బద్దల కొట్టినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించారు. సంఘటనా స్థలానికి సీఐ జగదీశ్వరరావు, ఎస్‌లు నాగరాజులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణాలకు వెళ్ళేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలని, పహారా కాసి చోరీలు జరగకుండా కాపాడుతామని వారు ప్రజలకు తెలియజేశారు.

అర్జీదారు అనుమతిలేకుండానే ఫిర్యాదుకు ముగింపు!

కుక్కునూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కారం కోసం అర్జీదారు ప్రభుత్వానికి సమస్య విన్నవిస్తే అది పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికా రులకు ఉంది. కానీ అర్జీదారు అనుమతి లేకుండానే సమస్య పరిష్కరించినట్టు చూపుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కుక్కునూరు మండలం పెదరావిగూడెం పంచాయతీలో అధికారుల అనుమతి లేకుండా టోల్ ఫీజు వసూలు చేస్తున్నారని రామకృష్ణ అనే వ్యక్తి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పెదరావిగూడెం సర్పంచ్ భర్త, పంచాయతీ గుమస్తా కలిసి అర్జీదారుడైన రామకృష్ణ ఇంటికి వెళ్లి అధికారుల నుంచి ఒత్తిడి వస్తుందని, ఏదో తప్పుజరిగింది ఇక నుంచి అలా జరగదని చెప్పి అర్జీక్లోజ్ చేసినట్టు రామకృష్ణ ఆరోపిస్తున్నాడు. తగిన న్యాయం చేయకుండానే ఇలా చేయడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు రామకృష్ణ గురువారం తెలిపారు. సమస్యకు పరిష్కారం కావాలని డిమాండ్ చేశారు.

రెండు బైక్‌లు ఢీ..

ఒకరికి గాయాలు

మొగల్తూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న బైకును ఢీకొన్న సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు. తూర్పుతాళ్ళు గ్రామానికి చెందిన చెన్నా ప్రగడ కనకప్రసాద్ బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న మరో బైక్ ఢీకొంది.ఈ ఘటనలో కనకప్రసాద్ తలకు బలమైన గాయాలవ్వడంతో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన సబ్ కలెక్టర్ వినూత్న



అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నూజివీడు మున్సిపల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను సబ్ కలెక్టర్ వినూత్న గురువారం పరిశీలించారు. పట్టణ పరిధిలోని మొగళ్ళ చెరువు, పెద్ద చెరువు, గొడుగువారి గూడెం, ఆర్‌ఆర్‌పేట, ఎంప్లాయిస్ కాలనీ, తిరువూరు బస్టాండ్ రోడ్డు, బైపాస్ రోడ్డు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది భారీ వర్షాల నేపథ్యంలో నెలకొన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుత పరిస్థితులలో ఎలాంటి నష్టం సంభవించకుండా తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. లోతట్టుగా ఉన్న మొగళ్ళ చెరువు, పెద్ద చెరువు ప్రాంతాలను ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల బృందంతో కలిసి పరిశీలించినట్లు వివరించారు. 24 గంటలు అధికారుల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. చెరువుల వద్ద కట్టలు పటిష్టంగా ఉండేందుకు కట్టదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూమ్ వద్ద సిద్ధంగా ఉండే సిబ్బంది సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ డీఈ అర్జునరావు, మున్సిపల్ కమిషనర్ వెంకట రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు ప్రయాణానికి అంతా సిద్ధం

తణుకు, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ఈనెల 15వ తేదీ నుంచి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి అంతా సిద్ధం చేసినట్లు తణుకు ఆర్టీసీ డీఎం సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ తణుకు డిపో పరిధిలో 61 పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు సిద్ధం చేసినట్లు వివరించారు. మొత్తంగా డిపో పరిధిలో 16 రూట్లలో ఉచితంగా మహిళలు ప్రయాణం చేయవచ్చని తెలిపారు.

మల్లేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా సత్యనారాయణ



ఆకివీడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మాదివాడ మల్లేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా బొల్లం వెంకట సత్యనారాయణ నియమితులయ్యారని టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు తెలిపారు. ధర్మకర్తలు పేటేటి భీమశంకరరావు, పెదగాడి కృష్ణ, యర్రా జాన్సీ, వాయిలాల జ్ఞానప్రసునాంబా, బాకా గంగాభవానిలు నియమితులయ్యారన్నారు.



వరికంకుల దండతో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజును సత్కరిస్తున్న సొసైటీ ఛైర్మన్ హాట్‌లైన్స్ బాబు

రైతులకు ఉత్తమ సేవలందించాలి

కాళ్ళ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ సొసైటీ పరిధిలోని రైతులకు ఉత్తమ సేవలందించాలని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు అన్నారు. కోపల్లె సొసైటీ ఛైర్మన్‌గా నంద్యాల రామరాజు (హాట్‌లైన్స్ బాబు) గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా గడి రాము, బుంగా ఆదాము ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వరికంకులతో ప్రత్యేకంగా తయారు చేయించిన దండతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ డీసీవో ఎస్.మురళీకృష్ణ, సీఈవో జె.సాయిగీత, ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, దంతులూరి శ్రీనివాసరాజు, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు జుత్తిగ నాగరాజు, కోరా రామ్మూర్తి, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు జీవీ నాగేశ్వరరావు, ఏరుబండి రామాంజనేయులు, సర్పంచ్‌లు బూడి నాగమణి, కొల్లి సుబ్బారావు, డొక్కు సోమేశ్వరరావు, మన్నే నాగరాజు, డీసీ ఛైర్మన్ తోట ఫణిబాబు పాల్గొన్నారు.

యండగండి సొసైటీ అభివృద్ధికి పాటు పడాలి

ఉండి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): యండగండి సహకార బ్యాంక్ సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని డిప్యూటి స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. బ్యాంక్ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా మంతెన రవివర్మ (వేణు), సభ్యులుగా బండారు రాఘవులు, అన్నెపు అప్పారావులచే ప్రమాణం స్వీకారం చేయించి అభినందించారు. రైతులకు సహకారం అందించడానికి రు.40కోట్ల రుణాలు అందించారంటూ అభినందించారు. ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ అభివృద్ధి కోసం ప్రణాళికతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ కార్యదర్శి చెరుకువాడ రవికుమార్‌వర్మ, జిల్లా సహకార బ్యాంక్ అధికారి సంకు మురళీకృష్ణ, సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి జి.సత్యనారాయణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామదాసు, టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు పాల్గొన్నారు.

కాండం కుళ్లు తెగులుపై అప్రమత్తంగా ఉండాలి



బొండాడలో తెగులు సోకిన వరిదుబ్బులను పరిశీలిస్తున్న ఏవో రమేష్ నాయుడు

కాళ్ళ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరిలో వచ్చే కాండం కుళ్లు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.రమేష్ నాయుడు రైతులకు సూచించారు. బొండాడలో గురువారం తెగులు సోకిన వరి పొలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ శిలీంధ్రం ఆశించడం వల్ల కాండం లోపల, కణుపులో మధ్య భాగమంతా నల్లగా మారుతుందన్నారు. తద్వారా వరి పిలకలు కిందకు వాలిపోయి, క్రమంగా దుబ్బు అంతా ఎండిపోతుందన్నారు. ఎండిన పిలకలు చీల్చి చూస్తే లోపలి భాగంలో నల్లని చిన్నచిన్న శిలీంధ్ర బీజాలు కనబడతాయని తెలిపారు. పొలంలో మురుగు నీరుపారుదల లేకపోవడం వల్ల ఈ తెగులు ఉధృతి పెరుగుతుందని తెలిపారు. ఈ తెగులు గుర్తించిన మొదటి దశలో హెక్సాకొనాజోల్ లేదా వాలిడమైసిన్ లేదా టెబుకోనజోల్ 2.00 మి.లీ. లీటరు నీటికి కలిపి 15 రోజులకు ఒకసారి రెండుసార్లు పిలకలు కింద వరకు తడిచేటట్లు మందు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

కూటమి పాలనతో ప్రజల్లో సంతృప్తి

పెంటపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు దాసరి శ్రీనివాస్ మరికొంతమంది తన సహచరులతో ఎమ్మెల్యే బొలిశెట్టి సమక్షంలో జనసేనలో చేరారు. వీరికి పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పుల్లా బాబి, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, కసిరెడ్డి మధులత, కొనకళ్ళ హరినాధ్, దాసరి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



పెంటపాడులో చెత్త సేకరణ ఆటోలను ప్రారంభించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు పంచాయతీలో నూతనంగా వచ్చిన చెత్త సేకరణ ఆటోలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ మాట్లాడుతూ ఒక్కో ఆటో విలువ రూ.2,91,500 అన్నారు. వీటిలో రెండు పంచాయతీ నిధుల నుంచి మరొకటి దాత మాజీ ఎంపీటీసీ కోనాల మురళీ మోహన్ అందజేశారన్నారు. కార్యక్రమంలో కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, బండారు వెంకట్రావు, తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ.సత్యనారాయణ, కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



ప్రకృతి వ్యవసాయవిధానంలో ద్రావణం తయారీ విధానాన్ని రైతులకు వివరిస్తున్న ఏవో బాలాత్రిపురసుందరి

యలమంచిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేయడం వలన ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి బాలాత్రిపురసుందరి అన్నారు. గుంపర్రు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏవో బాలాత్రిపురసుందరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ విధానంలో సాగుచేయడం వలన తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంట సాధించవచ్చన్నారు.

16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

యలమంచిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సంస్కార భారతి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన దొడ్డిపట్ల గ్రామంలోని కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు చేగొండి వీరవెంకట సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ వేడుకల్లో చిన్నారుల శ్రీకృష్ణ వేషధారణ ప్రదర్శన, శ్రీకృష్ణతత్వంపై ప్రముఖుల ప్రసంగాలు, కోలాట ప్రదర్శన, ఉట్టివేడుకలను నిర్వహిస్తామని తెలియజేశారు.

పాలకొల్లు టౌన్: ఈ నెల 16వ తేదీన పాలకొల్లు ఎర్రవంతెన వద్ద ఉన్న శ్రీకృష్ణాలయంలో కృష్ణాష్టమి నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, అధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.







నరసాపురంలో విప్ నాయకర్, గణపవరంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు వినతి పత్రం అందిస్తున్న ఆటో డ్రైవర్లు.. బ్రాహ్మణచెరువు వద్ద ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

ఉచిత బస్సు ప్రయాణం వద్దంటూ ఆటో డ్రైవర్ల సమ్మె

తాడేపల్లిగూడెం/పెనుగొండ/నరసాపురం టౌన్/ పెంటపాడు /తాడేపల్లిగూడెం రూరల్/ గణపవరం/అత్తిలి/ఇరగవరం/పెనుమంట్ర/భీమవరం క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళకు ఉచిత బస్సు సౌకర్యం కలిపిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ తాడేపల్లిగూడెం పట్టణంలోని ఆటో డ్రైవర్లు గురువారం సమ్మె చేపట్టారు. ఆటోలను నిలుపుదల చేసి నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల తమ ఉపాధి రోడ్డున పడుతుందని వారు ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే ప్రభుత్వం నిర్ణయం ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణంలోని ఆటోయూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెనుగొండలో తమ జీవనోపాధి దెబ్బతీయవద్దంటూ ఆటో డ్రైవర్లు ఆందోళన చేశారు. నరసాపురంలో ఉచిత బస్సు పథకాన్ని నిరసిస్తూ బస్టాండ్ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన చేశారు. ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హమీలను తక్షణం అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీగా జనసేన కార్యాలయానికి తరలివెళ్లారు. అక్కడ ప్రభుత్వ విప్ నాయకర్‌ను కలిశారు. వినతి పత్రం అందించారు. పెంటపాడు మండలంలో ఆటో డ్రైవర్లు చేసిన సమ్మె విజయవంతంగా జరిగింది. ఉదయం నుంచి ఆటో డ్రైవర్లు సమ్మెకు దిగారు. దీంతో ఇతరాత్ర పనులపై వెళ్ళే మహిళలు, ప్రత్యేక తరగతులకు వెళ్ళే విద్యార్థులు, కొంతమంది ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల కోసం పడిగాపులు కాశారు. బస్సులు పాసింజర్ల రద్దితో ఊగిపోయాయి. పెంటపాడు నుంచి తాడేపల్లిగూడెంకు ప్రతి కొన్ని వందల మంది మహిళలు చింతపండు, మిరపకాయలు ఇలా తదితర పనులకు వెళ్తుంటారు. ఆటోల సమ్మెతో వాళ్ళందరూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నవాబుపాలెం వద్ద గురువారం ఆటో డ్రైవర్లు ధర్నా చేశారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని అంబేద్కర్ ఆటోయూనియన్ అధ్యక్షుడు సిద్దిన మణికంఠ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కండెల్లి శేఖర్, ఉపాధ్యక్షుడు కునపోకుమార్ పాల్గొన్నారు. గణపవరం బస్టాండ్ ఎదురుగా ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. అంతకుముందు ఆటోర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం వలన ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని తెలిపారు. అత్తిలి బస్టాండ్ సెంటర్లో ఆటో కార్మికులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 300 మంది నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇరగవరంలో ఆటోలతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో శ్రీ మెంటాలమ్మ ఆటో యూనియన్, శ్రీసాయి కనకదుర్గ ఆటో యూనియన్ల డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బ్రాహ్మణ చెరువు నుంచి పెనుమంట్ర వరకు ఆటో డ్రైవర్లు ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాజు, ఆటో యూనియన్ నాయకులు కేతా శ్రీను, బొంతురామకృష్ణ, టి.నాగిరెడ్డి, పీటర్ తదితరులు పాల్గొన్నారుభీమవరం ప్రధాన కూడలి ప్రకాశం చౌక్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లు ఆందోళన చేశారు. స్థానిక శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా, భీమవరం పట్టణం ఆటో యూనియన్ అధ్యక్షులు యింటి సత్యనారాయణ, పట్టణ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు పంపన గోపి, పట్టణ ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు బేతాళ కమలాకర్, ములుగుర్తి కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి మిండకుదురు రవి పాల్గొన్నారు.





తాడేపల్లిగూడెంలో వలవల బాబ్జికి స్వీట్ తినిపిస్తున్న షరీఫ్.. పెనుగొండలో టీడీపీ నాయకుల ప్రదర్శన

టీడీపీ విజయోత్సాహం

కడపలోని జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయం

జిల్లా పార్టీ నాయకుల సంబరాలు

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటి మిట్ట మండలాల్లో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికలలో టీడీపీ అభ్యర్థులు సాధించిన విజయం చారిత్రాత్మకమని రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ సలహాదారుడు మహ్మద్ షరీఫ్ అన్నారు. గురువారం పట్టణ మైనారిటి సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ నివాసానికి వచ్చిన షరీఫ్‌ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉప ఎన్నికలలో సాధించిన విజయానికి కేకు కట్ చేసి, స్వీటు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పట్నాల రాంపండు, పరిమి రవికుమార్, గంధం సతీష్, ముత్యాల సత్యనారా యణ పాల్గొన్నారు.

పెనుగొండ:కడప జిల్లాలో టీడీపీ అభ్యర్థుల విజయం పట్ల పెనుగొం డలో కూటమి నాయకులు బాణసంచా కాల్చి పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నక్కా వేద వ్యాస శాస్త్రి, ఏఎంసీ ఛైర్మన్ బడేటి బ్రహ్మజీ, కిటికి రెడ్డి నానాజీ, మండా ప్రసాద్, చలుమూరి చంద్రశేఖర్, జనసేన నాయకులు సూరిబాబు, కౌరు శ్రీని వాసు, రొక్కాల సురేష్, మద్దింశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

ఆకివీడు: ఆకివీడులో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, అజ్మల్, శ్రీనివాసరాజు, రామారావు, జాకీర్ పాల్గొన్నారు.

పులివెందులకు స్వాతంత్ర్యం

తణుకు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని తెలుగుదేశం గెలుచుకోవడంతో అక్కడ ప్రజానీకానికి ఒకరోజు ముందుగానే స్వాతంత్ర్యం వచ్చిందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. జగన్ అరాచకాలకు పులివెందులలో తెరపడిందన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేస్తే ఫలితం ఎలా ఉంటుందో జడ్పీటీసీ ఎన్నికల్లో నిరూపణ అయ్యిందన్నారు.

నరసాపురం టౌన్: పులవెందుల జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి లతారెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం పట్ల మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అక్కడ 20 ఏళ్లగా ఓటుకు దూరంగా ఉంటున్న ప్రజలకు కూటమి ప్రభుత్వం స్వేచ్ఛనిచ్చి నిజాయితీగా ఓటు వేసేలా చేసిందన్నారు. ఇప్పటికైన జగన్ బుద్ధి తెచ్చుకోవాలన్నారు.

తణుకు రూరల్:వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలను తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించడం ప్రజాస్వామ్య విజయమని తెలుగు దేశం పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబా, తణుకు ఎస్సీ సెల్ అధ్యక్షుడు చదలవాడ నానీ అన్నారు. మండపాక గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పొందుపర్చిన ఓటు హక్కును పులివెందుల, ఒంటిమిట్ట ఓటర్లు ఇంత కాలానికి సద్వినియోగం చేసుకున్నారని అన్నారు.

పేద విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వాలు

తాడేపల్లిగూడెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో చదవుతున్న పేద విద్యార్థులకు పట్టణంలోని గరికపాటి కళాపీఠం ఆధ్వర్యంలో గ్రంథాలయ సభ్యత్వాలను అందజేశారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గరికపాటి కళాపీఠం నిర్వాహకులు గరికపాటి బాపయ్య శర్మ కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మైనం సత్యనారాయణ, జనవిజ్ఞాన వేదిక సలహాదారు ప్రత్తి వీరాస్వామి, ఏవీ లక్ష్మణరావు పాల్గొన్నారు.



భవిత కేంద్రంలో స్వాతంత్ర్య వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సుబ్బారావుపేటలోని భవిత కేంద్రంలో స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. దేశ నాయకుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయుడు కె బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, ఫిజియో థెరపి వైద్యులు డాక్టర్ అల్లుశ్రీకృష్ణ మహేష్ జాతీయ జెండా ఎగురవేశారు.




జాతీయ జెండాలతో ర్యాలీ

భీమవరం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మూడు రంగుల మువ్వన్నెల పతాకం ప్రతి ఇంటిపైన ఎగుర వేయాలని కేజీఆర్ఎల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇంటి శ్రీరామ చంద్రమూర్తి అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా గురువారం జాతీయ జెండాలు, దేశ నాయకుల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. పీజీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కవల నాగేశ్వరరావు, డాక్టర్ తోట రామ్మూర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘ అధ్యక్షులతో సీఎం సమీక్ష

నరసాపురం రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల అధ్యక్షులలతో గురువారం సీఎం చంద్రబాబు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నరసాపురంలో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో డిస్ట్రిబ్యూటర్, నీటి సంఘం అధ్యక్షులు సమీక్షలో పాల్గొన్నారు. నీటి నిల్వలు, సాగునీటి ఇక్కట్లు తదితర సమస్యలను ఏ విధంగా అధికమించాలన్న దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షులకు నివృత్తి చేశారు. ప్రాజెక్టుల అనుసంధానం చేయడం వల్ల ఎక్కడ సాగునీటి ఎద్దడి రాదన్న విషయాన్ని రైతుల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ, వీరరామవులు, ఆడ్డాల శ్రీను, శాంతరాజు, ఏతః శ్రీనివాస్, పావని, మనోహార్ పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



తణుకులోని ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి నీరు చేరిన దృశ్యం

తణుకు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కారణంగా లోతట్లు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులు సైతం పెద్ద ఎత్తున వ ఏునిగిపోయ ాం౦ు. లోతట్టులో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం వర్షం నీరు చేరింది. గురువారం ఉదయాన్ని చాలా వరకు అన్ని ప్రాంతాల్లో మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రెయిన్‌లు క్లియర్ చేసి నిల్వ ఉన్న వర్షం నీటిని ప్రవహించే విధంగా మార్గం ఏర్పాటు చేయడం నీరు అంతా లాగేసింది. పట్టణంలోని ఒక అపార్టుమెంటులోని సెల్లార్ చేరిన వర్షం నీరు మాత్రం అలానే ఉండిపోయింది. దీంతో ఆయా అపార్టుమెంటులో ఉన్న నివాసులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. మోటారు ఇంజన్‌లు ఏర్పాటు చేసుకొని సెల్లార్‌లో ఉన్న నీటిని బయటకు తోడుకున్నారు.

కార్మికుల కొత్త సమయాలను రద్దు చెయ్యాలి

భీమవరం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పారిశుద్ధ్య కార్మికులు వేకువజామున 4 గంటలకు విధులకు హాజరుకావాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు, కొల్లాబత్తుల మహంకాళి గురువారం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రా రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా భీమవరంలో కొత్తగా సమయాలను మార్చడంపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం సెలవు రోజున పనులు చేయాలని లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారని నాయకులు కమిషనర్ దృష్టికి తెచ్చారు. తెల్లవారుజామున రోడ్లు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, మహిళా కార్మికులకు భద్రత ఉండదని, వీధుల్లో లైటింగ్ సరిపోదని తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

తాడేపల్లిగూడెం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బాధితుల పక్షాన కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బంగారుగూడెం గ్రామానికి చెందిన వారికి గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, అడబాల మురళీ, అడ్డగర్ల సూరి, సూర్పని శ్రీను, మట్టా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబైన ఆచంటలోని పంచాయతీ కార్యాలయం

ప్రభుత్వ కార్యాలయాల ముస్తాబు

ఆచంట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని మండలంలో ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. శుక్రవారం జరిగే వేడుకలను పురస్కరించుకుని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేసి అందంగా అలంకరించారు. నియోజకవర్గ కేంద్రమైన ఆచంట పంచాయతీని జాతీయ జెండాలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

బస్సులు కిటకిట

అత్తిలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి బస్టాండ్ గురువారం ప్రయాణికులతో కిక్కిరిసింది. ఆటో యూనియన్ సంఘాలు ఉచిత బస్సు ప్రయాణాన్ని నిరసిస్తూ చేపట్టిన దీక్షతో ఆటో ప్రయాణాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్సులన్నీ ప్రయాణికులతో నిండిపోయాయి.



79వ నంబరు ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

విద్యార్థుల వినూత్న ప్రదర్శన

తణుకు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 79 అంకె ఆకారంలో కూర్చొని వేడుకలకు స్వాగతం పలికారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ సన్నాహక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు జాతీయ జెండాలను చేతపట్టుకుని పాఠశాల ఆవరణలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేఎస్‌వీవీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్యాల రత్నంకు నియామక పత్రం



ముత్యాల రత్నంకు నియామక పత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆకివీడు రూరల్ ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆకివీడు రూరల్ బ్యాంకు తిసభ్య కమిటీ ఛైర్మన్‌గా జనసేన నాయకులు ముత్యాల రత్నంకు నియామక పత్రాన్ని టీడీపీ మండల అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్ గురువారం రాత్రి అందజేశారు. సభ్యులుగా మర్రివాడ వెంకట్రావు, ఊడిగ శ్రీనివాసరావులను నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసీ ఛైర్మన్ బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, పిల్లా బాబులు, నౌకట్ల రామారావు, అజమాల్, జాకీర్, బచ్చు కృష్ణ, జన్నుగోపి అభినందనలు తెలిపారు.

ముంపు రైతుల్ని ఆదుకోవాలి

గణపవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వర్షాలకు ముంపునకు గురైన వరి పైరు నష్టాలు అంచనా వేసి రైతులను ఆదుకోవాలని ఎంపీపీ దండు వెంకట్రామరాజు ప్రభుత్వాన్ని కోరారు. గురవారం గణపవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన దండు వెంకట్రామరాజు మాట్లాడుతూ వరిపొలాలను కాపాడేలా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదనీరు యనమదుర్రులోకి పోటెత్తుతుందన్నారు. రెవిన్యూ, వ్యవసాయాధికారులంతా సమన్వయంతో పని చేసి యనమదుర్రు పరీవాహక లోతట్టు పంటపొలాలకు, ప్రజలకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల గ్రామాల్లో 1770 ఎకరాలు వరిపైరు నీటిముంపుకు గురైందని వ్యవసాయాధికారి ఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు.